# మన(సు)లో మాట

ఆంగ్ల నూతన సంవత్సరము మరియు సంక్రాంతి సందర్భముగా మీకు అందరికీ  శుభాకాంక్షలు. ఈ సంవత్సరము ఎల్లరు భోగభాగ్యాలతో, ఆనందముతో, సత్కార్యములు నిరాటంకముగా పూర్తి చేస్తూ ముందడుగు వెయ్యాలని ఆకాంక్షిస్తున్నాము.

గత సంవత్సరము పోతూ పోతూ మానవాళి మరచి పోలేని విధముగా 'Tsunami' రూపములో వ్యధ మిగిల్చింది. కాలమనే కాళము కడలి కెరటమై ఉవ్వెత్తున లేచి వేలాది ప్రాణాలను కబలించింది. బంధుమిత్రులను, ఆప్తులను, జీవనోపాధిని, సర్వస్వాన్ని కోల్పోయిన వాళ్ళ కన్నీరు సాగరపర్యంతమవుతున్నాది. ఈ సంఘటన జరిగి కొన్ని వారాలైనా ఇప్పటికి సాగర తీరానికి వెళ్ళడానికి చాలామంది భయపడుతున్నారంటే, వారి మనసుపై పడిన ముద్రను మనము ఊహించుకోవచ్చు. ఈ స్థితిలో ప్రాణాలను కోల్పోయినవారి ఆత్మ శాంతి కోసము, బంధు మిత్రులను, ఆప్తులను కోల్పోయిన వారికి మానసిక, శారీరక గాయాలనుండి త్వరగా కోలుకోవాలని కోరుకుందాము. జీవనాధారాన్ని, తల్లిదండ్రులను కోల్పోయిన వారికి మన శక్తి మేరకు ఆర్ధికముగా గాని, మరో విధముగా గాని సహాయపడదాము. ఇలాంటి భీభత్సమైన సంఘటన మరెప్పుడూ జరుగకూడదని ప్రార్ధించడము తప్ప మరేమీ మన చేతిలో లేదు. మనము చేయగలిగింది ప్రకృతిని సంరక్షించడం - మొక్కలు పెంచడము ద్వారా గాని, కాలుష్యాన్ని తగ్గించడము ద్వారా గాని, ఇంటి చుట్టూ సాధ్యమైనంతవరకు మట్టి నేలగా ఉంచడము (flooring చేయించకుండా) ద్వారా గాని మన ప్రయత్నము చెయ్యవచ్చు.

గత సంచికతో పోలిస్తే ఈసారి క్రొత్త క్రొత్త అంశాలతో పత్రికకు 'సం'క్రాంతి వచ్చింది. పిల్లలను దృష్టిలో ఉంచుకుని మేధమేట్రిక్స్ అంశాన్ని ప్రత్యేకముగా రూపొందించాము. మా ప్రయత్నము మీ మన్ననలు పొందుతుందనే మా నమ్మకము. ఇది కాక 'మీకు తెలుసా?', 'సంక్రాంతి పండుగ - విలువలు' వంటి అంశాలు మిమ్ములను అలరిస్తాయని ఆశిస్తాము.రానున్న సంచికలో మరిన్ని నూతన అంశాలతో సంఘమిత్ర మీ ముందుకు వస్తుందని హామీ ఇస్తూ మా ప్రయత్నానికి చేయూత నిమ్మని (మీకు తెలిసిన విషయాలను పంపడము ద్వారా!) కోరుతున్నాము. ఇందులోని 'బాలమిత్ర', 'చరిత్రకెక్కిన చరితార్ధులు' వంటి అంశాలను మీరు మీ పిల్లలకు చదివి వినిపించండి. తద్వారా మన భాష, సంస్కృతి మొదలైన విషయాలు మన భావి తరాలకు అందించిన వారమవుతాము. పిల్లలతో సాధ్యమైనంతవరకూ ఇంటిలో మాతృభాషను మాట్లాడడము ఒక నిత్యకృత్యముగా చేసుకుని, వారికి మాతృభాష పట్ల మమకారము కలిగేటట్లు చేయండి. ఇది మా హృదయపూర్వక విన్నపము. 'మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు బోవునే మదనములకు' అన్నట్లు ఈ భాష అందచందాలు, మాధుర్యము రుచి చూస్తే దానిని వదిలి పెట్టడము అసంభవము అని సవినయముగా తెలియజేస్తూ

సంపాదక బృందం.